క్లుప్తంగా

ఏసు బోధనలను అనుసరించాలి

కంబదూరు: ప్రతి ఒక్కరూ ఏసు బోధనలను అనుసరించి మోక్షమార్గానికి వెళ్లాలని గుత్తి బైబిల్ మిషన్ ప్రెసిడెంట్ రెవరెండ్ బి.అద్భుత కుమార్, దైవజనురాలు బి.మణికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా రెండు రోజులుగా జరుగుతున్న మహిమ సువార్త సభలు మంగళవారం రాత్రి ముగిశాయి. సువార్త సభలకు వచ్చిన క్రైస్తవులు, ప్రజల నుద్దేశించి వారు ఆధ్యాత్మిక సందేశాన్ని బోధించారు. చివరి రోజు సభలకు క్రైస్తవులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

‘పోషణ పక్వాడ్’తో ఆరోగ్యం

కళ్యాణదుర్గం: మండలంలోని పాలవాయి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సాలమ్మ, రాధాలక్ష్మి, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో కలిసి పౌష్టికాహారంతో పోషణ పక్వాడ్ చిత్రం గీసి కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రాజేశ్వరి, ఆయాలు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై నేడు ర్యాలీ

రాయదుర్గంటౌన్: స్వచ్ఛాంధ్రమిషన్‌లో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాలపై బుధవారం ఉదయం 10 గంటలకు పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప హాజరవుతారన్నారు. అవగాహన ర్యాలీతో పాటు స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేపడతామని, మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

సంకీర్ణ రాజకీయాలకు ప్రాధాన్యం

కళ్యాణదుర్గం: ప్రజాస్వామ్య వ్యవస్థలో సంకీర్ణ రాజకీయాలకు ప్రాధాన్యత సంతరించుకోవడంతో స్థిర ప్రభుత్వాలు కొనసాగే అవకాశాలు సన్నగిల్లుతున్నాయని రాయదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ , డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సంకీర్ణ రాజకీయాలపై ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజనీతి శాస్త్రం అధ్యాపకుడు డా.పి.ఎల్.కాంతారావు, డా.మురళీకృష్ణ , పరమేష్ పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కంబదూరు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆరో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఓ రూప మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్స్ లో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 20లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.


భూ సర్వేతో సమస్యలకు చెక్



డ్రోన్‌ను పరిశీలిస్తున్న మంత్రి

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేతో భూ సమస్యలకు చెక్ పెట్టవచ్చునని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని హిందూపురం రోడ్డులో మంగళవారం పట్టణ సర్వే పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రోన్ పనితీరు, హద్దులు ఏర్పాటు, రోజుకు ఎన్ని కిలోమీటర్లు సర్వే చేస్తుంది, ఎలా హద్దులు నిర్ణయిస్తారు తదితర విషయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నాలుగైదు రోజుల్లో సర్వే పూర్తి చేస్తామని సిబ్బంది మంత్రికి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, కమిషనర్ వెంకటేశులు, టీపీఎస్ అలివేళమ్మ, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, సచివాలయ కన్వీనర్లు అర్చన, అంజనేయులు, తిమ్మరాజు, రాము, నాయకులు ఉమాపతి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహానికి తొలగని ముసుగు



బొమ్మనహాళ్: మండల కేంద్రం బొమ్మనహాళ్‌లో అధికారుల నిర్లక్ష్యం మూలాగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎన్నికల ముసుగు తొలగించలేదు. గత నెలలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మహానేత విగ్రహానికి అధికారులు ముసుగు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఈ నెల 20న ఎత్తివేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారులు ప్రకటించారు. అయినామండల అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరించడంతో మంగళవారం వరకూ వైఎస్సార్ విగ్రహానికి ముసుగును తొలగించలేదు. గోవిందవాడ గ్రామంలో కూడా వైఎస్సార్ విగ్రహానికి ముసుగును తొలగించలేదు. కోడ్ ముగిసినా అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారు.

మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం





బ్రహ్మసముద్రం: మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, కుందుర్పి: మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

- ఆసరా చెక్కుల పంపిణీలో మంత్రి ఉషశ్రీచరణ్

బ్రహ్మసముద్రం: మహిళలు ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖమంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ గతంలో మహిళల కోసం ఇన్ని సంక్షేమ పథకాలు ఏ ముఖ్యమంత్రి అమలు చేయలేదన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడతలో మండలంలోని 38 సంఘాలకు సంబంధించి 1,063 మంది అక్కచెల్లెమ్మలకు రూ.4.53 కోట్లు జమ చేశారన్నారు. రుణమాఫీ పేరుతో గతంలో చంద్రబాబు మహిళలను మోసం చేశారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, అన్నివర్గాల ప్రజలకూ న్యాయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజనేయులు , జెడ్పీటీసీ ప్రభావతి, వీరశైవలింగాయత్ డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి అశోక్‌రెడ్డి, రైతుసంఘం అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటనాయుడు, తహసీల్దార్ బాలకిషన్ , ఎంఈఓ ఓబుళపతి, వైస్ ఎంపీపీలు వెంకటేశ నాయక్, సునందమ్మ , సర్పంచ్‌లు పూజ, మంజునాథ, ఆదినారాయణరెడ్డి, గోవిందప్ప , ఎంపీటీసీలు నాగలక్ష్మి, నగేష్, నరసింహ పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపులో సింహ భాగం మహిళలకే

కుందుర్పి: బడ్జెట్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సింహభాగం మహిళలకే కేటాయించి, అన్ని సంక్షేమ పథకాల్లో పెద్దపీట వేస్తున్నారని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మూడో విడుత ఆసరా వారోత్సవాల్లో భాగంగా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మండలంలో 8,179 మహిళలకు రూ.6.02 కోట్ల మెగా చెక్కును మంత్రి మహిళలకు అందజేసి, వారి సమక్షంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాధాస్వామి, ఎంపీపీ కమలమ్మ, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పాలాక్షి, మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, వైస్ఎంపీపీ బీజప్ప, శ్రీలక్ష్మి, మండల సచివాలయ కన్వీనర్ ఈ.రాము, సింగిల్‌విండో అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ నారాయణస్వామి, ఏపీఎం హుసేన్, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యం



మహిళలకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



థ్యాంక్యూ సీఎం సర్ అని ప్లకార్డులను చూపుతున్న వైకేపీ మహిళా సంఘాల సభ్యులు

- మూడో విడత వైఎస్సార్ ఆసరా ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: సంక్షేమ పథకాల అమలులో మహిళలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ఆధిక ప్రాధాన్యత ఇస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీనివాస విద్యానికేతన్ క్రీడా ప్రాంగణంలో ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన వెలుగు ఏపీఎం రామ్‌మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమానికి వేల మంది మహిళలు స్వచ్ఛందంగా వస్తుంటే.. టీడీపీ నారా లోకేష్ యువగళం కార్యక్రమానికి జనం లేక పోవడంతో డబ్బులు చెల్లించి తీసుకువస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు మహిళా సంఘాలకు డ్వాక్రా రుణాల రద్దు చేస్తామని మోసం చేసి, పసుపు కుంకుమ పథకంతో ఓట్లు దండుకోవాలని చూసారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా రుణమాఫీ అమలు చేసి సంఘాలను శక్తివంతం చేశారన్నారు. సచివాలయ వ్యవస్థతో లబ్ధిదారుల గడపల వద్దకే సంక్షేమ పథకాలు అందించే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న 2024 ఎన్నికల్లో మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం సీఎం చిత్రపటానికి మహిళా సంఘాల సభ్యులతో కలసి ఆయన క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, నాయకుడు త్రిలోక్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్, అగ్రిబోర్డు మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, మార్కెట్ యార్డు మాజీ ఉపాధ్యక్షులు పాటిల్ నాగిరెడ్డి, తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి, ఎంపీడీఓ యాదవేంద్ర, సర్పంచ్‌లు సాహితిరెడ్డి, మారుతమ్మ, రామిరెడ్డి, ఎండీ పెద్దన్న, రుద్రానంద, రమేష్, ఎంపీటీసీలు ప్రసాద్, ఈశ్వర్, మహిళా సంఘం మండల కమిటీ సభ్యులు ముంతాజ్, సరస్వతి, వెంకటమ్మ, భవాని, ఆవులెన్న సహకార సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మారెమ్మ అమ్మవారి జాతర



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం రూరల్: మండలంలోని కాశీపురం గ్రామంలో మంగళవారం మారెమ్మజాతర ఘనంగా నిర్వహించారు. ఏటా చైత్రమాసంలో రెండో మంగళవారం జాతర నిర్వహించిడం ఆనవాయితీ. జాతర సందర్భంగా ఉదయం 5 గంటలకే వేదావతి నదిలో గంగపూజ చేసి, అక్కడి నుండి తెచ్చిన గంగాజలంతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. మహిళలు బోనాలు తలపై మోసుకుని అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు. జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ పుష్పావతి, బోర్‌వెల్ నాగిరెడ్డితో కలసి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండి రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భారతి, ఉపసర్పంచ్ కావలి శేఖర్ , గ్రామ పెద్దలు జలంధర్ నాయుడు, కెంచానపల్లి బుజ్జి, మురారి, వెంకటేశులు, అయ్యప్ప, హైదరాబాద్ వన్నూరుస్వామి, కావలి తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అన్నివర్గాల సంక్షేమం



తిమ్మాపురంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కంబదూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని, నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికీ రూ.రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ లబ్ధి చేకూరిందని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు.అలాగే స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజల నుంచి తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, మండల కన్వీనర్ బాలరాజు, వైస్ ఎంపీపీ భీమేష్, సచివాలయాల మండల కన్వీనర్ సాకే గంగాధర్, సర్పంచ్‌లు సంధ్య, బాపూజీ, విజయ్‌కుమార్, నాయకులు హరినాథ్, బసప్ప, కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, ధనరాజు, లోకనాథ్, వడ్డే చంద్ర, కురుబ చిరంజీవి, మాల రాజు, డీలర్ మహేష్, కురుబ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి సన్మానం



ఎమ్మెల్సీని సత్కరిస్తున్న బీసీ గురుకుల కాంట్రాక్టు ఉద్యోగులు

ఉరవకొండ: వజ్రకరూరు మండలంలోని ఎమ్మెల్సీ స్వగ్రామం కొనకొండ్లలో బీసీ గురుకుల కాంట్రాక్టు ఉద్యోగులు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని ఘనంగా సత్కరించారు. బీసీ గురుకులాల్లో కొన్నేళ్ల నుంచి కాంట్రాక్టు ఏజెన్సీల కింద పనిచేస్తూ సకాలంలో వేతనాలు అందక, ఈపీఎఫ్, ఈహెచ్ఎస్‌కు నోచుకోక కాంట్రాక్టు ఉద్యోగులు అవస్థలు పడేవారు. ఇటీవల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రమణ, కార్యదర్శి శివకాంత్ తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని కోరారు. సమస్యను ఆయన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లడంతో.. రాష్ట్ర వ్యాప్తంగా 1400 మంది బీసీ గురుకుల కాంట్రాక్టు సిబ్బందిని ఆప్కస్‌లో విలీనం చేస్తు ఉత్తర్వులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెండు రోజుల క్రితం వెనుకబడిన తరగతుల ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి ఉత్తర్వులు జారీచేయడంతో.. వారు ఎమ్మెల్సీని సన్మానించారు.

‘వైఎస్సార్ జలకళ’ రైతులకు వరం



అంకంపల్లిలో మోటార్లను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: వైఎస్సార్ జలకళ పథకం రైతులకు వరమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అంకంపల్లి, ఎర్రగుడి గ్రామాల్లో జలకళ పథకం కింద బోరుబావి మోటార్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు రుద్రానంద, ప్రకాశ్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రభావతి, నాయకులతో కలసి 26 మంది రైతులకు మోటార్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తమ భూముల్లో బోరుబావులను ఏర్పాటు చేసుకుని పంటలు సాగు చేసుకోవాలన్న రైతుల కలను వైఎస్సార్ జలకళతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. బోరుబావి తవ్వకం మొదలు, విద్యుత్ కనెక్షన్, మోటారు పంపులను ఉచితంగా అందివ్వడంతో పాటు సబ్సిడీతో డ్రిప్ సౌకర్యం కల్పిస్తూ సీఎం రైతు పక్షపాతిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షులు సీపీ వీరన్న, జలకళ టీఏ మల్లికార్జున, పార్టీ నాయకులు త్రిలోక్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బ్రహ్మయ్య, గంగాదర్, అక్కులన్న, షణ్ముఖ, నరిగన్న, అండగి ఎర్రిస్వామి, పూల ప్రసాద్, పోతన్న, మదుసూదన్‌రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

ఉరవకొండ: క్రీడాకారులు గెలపోటములను సమానంగా స్వీకరించినపుడే క్రీడల్లో రాణించే అవకాశం ఉంటుందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, యువజన విభాగం నాలుగు జిల్లాల జోనల్ అధ్యక్షుడు వై.ప్రణయ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో రాకెట్ల నారాయణరెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నీ అట్టహసంగా ప్రారంభించారు. టోర్నీ ప్రారంభోత్సవ సభకు పెన్నహోబిలం ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అశోక్ అధ్యక్షత వహించారు. అనంతరం నిర్వాహకులు సింగాడి ధనరాజ్, వడ్లసలీం ఆధ్వర్యంలో ఉరవకొండ-జల్లిపల్లి జట్ల మధ్య మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉరవకొండ, విడపనకల్లు, కూడేరు మండలాల ఎంపీపీలు చంద్రమ్మ, కరణం పుష్పావతి, నారాయణరెడ్డి, ఉరవకొండ, విడపనకల్లు జెడ్పీటీసీలు ఏసీ పార్వతమ్మ, హనుమంతు, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, వైస్ ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, పార్టీ రాష్ట్ర నాయకులు వెంకట్‌రెడ్డి, తేజోనాథ్, వడ్లషేక్షావలి, బసన్న, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు

ముస్లింలకు ఇఫ్తార్ విందు

ఉరవకొండ: స్థానిక గుంతకల్లు రోడ్డులోని సామిల్ వద్ద ఉరవకొండ పీఏసీఎస్ చైర్మన్ వడ్లహజీ షేక్షావలి, పార్టీ యువజన విభాగం నాయకుడు వడ్ల సలీం ఆధ్వర్యంలో పట్టణంలోని ముస్లింలకు మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పార్టీ యువజన విభాగం జోనల్ అధ్యక్షుడు ప్రణయ్‌రెడ్డి ముస్లింలకు వడ్డించి వారితో పాటు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ నాయకులు పామిడి సలీం, జాకీర్, జిలాన్, ఆసీఫ్, అన్వర్,దాదు, పామిడి నిజాం పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

కళ్యాణదుర్గం: గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని డీఎస్పీ బి.శ్రీనివాసులు అన్నారు. పరివర్తన పేరుతో కళ్యాణదుర్గం పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని యువతీ యువకులకు మాక్ ఇంటర్వ్యూ చేపట్టారు. ఇటీవల పోలీసు శాఖ ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో ఆయా గ్రామాల మహిళా పోలీసులచే నిరుద్యోగ యువతీ యువకులను గుర్తించారు. వీరందరికీ జాబ్‌మేళాలో తీసుకోవాల్సిన ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ కల్పించారు. కృష్ణా జిల్లాకు చెందిన పీవీఎస్ఆర్ గ్రూప్స్ సీఈఓ పామర్తి గోపీచంద్ ఇంటర్వ్యూలో ఎలా ఉండాలి..? డ్రెస్ కోడ్...క్రమశిక్షణ, తదితర స్కిల్స్‌పై నిరుద్యోగులకు వివరించారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో పది, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లమో, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ లాంటి ఉన్నత చదువులు చదివి ఖాళీగా ఉన్న వారిని గుర్తించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే పోలీసు శాఖ లక్ష్యమన్నారు. ఇందుకు ఏప్రిల్ 3, 4 తేదీలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. కాగా శిక్షణకు సుమారు 350 మందికి పైగా యువతీ, యువకులు హాజరుకాగా పోలీసులు భోజన వసతి కల్పించారు. సీఐలు తేజమూర్తి, శ్రీనివాసులు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వేలం పాటలో వివాదం..!

- ఇరువర్గాల బాహాబాహీ

రాయదుర్గం: పురపాలక సంఘం పరిధిలోని సుంకం వసూళ్లకు మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలం పాట ఇరు వర్గాల మధ్య వివాదాలకు దారితీసింది. 2023–24 వ సంవత్సరానికి మున్సిపల్ దినసరి, వారపు సంత, జంతువధశాలలకు చెందిన సుంకం వసూళ్ల కోసం చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట ప్రారంభించారు. ఇందులో 17 మంది పాల్గొన్నారు. కొందరి అత్యుత్సాహం, ఆధిపత్యం కారణంగా ఇరువర్గాల వారు బాహాబాహికి దిగి అధికారుల సమక్షంలోనే తన్నుకునే స్థితికి వెళ్లారు. అప్రమత్తమైన కమిషనర్ వెంటనే పోలీసులకు సమాచారం చేరవేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి వివాదాన్ని సద్దుమణిగించారు. అనంతరం వేలంను బుధవారం మధ్యాహ్నానికి వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. ఇదిలా ఉండగా కావాలనే కొందరు గొడవకు దిగానని ఓ వర్గం వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీని వెనుక కొందరు ఉండి నడిపిస్తున్నారని ఆరోపించారు.

క్షయవ్యాధి నివారణకు కృషి చేయాలి

గుమ్మఘట్ట: క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పీహెచ్‌సీ వైద్యుడు రమేష్ సూచించారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి పరీక్షకు ల్యాబ్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో వైద్యుడు బాలాజీ నాయక్, సీహెచ్ఓ మురళీధర్, సూపర్‌వైజర్లు రవి కుమార్, ఆదిబయమ్మ, రాయదుర్గం టీబీ యూనిట్ సూపర్‌వైజర్ శ్రీకాంత్‌నాయక్, ల్యాబ్ సూపర్‌వైజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ హబ్ సెంటర్‌లో రెండు కొత్త కోర్సులు

రాయదుర్గంటౌన్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్‌డీసీ) ఆధ్వర్యంలో మొదటి విడతలో భాగంగా రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో మరో రెండు కొత్త కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటీవ్ డొమెస్టిక్ వాయిస్ కోర్సులకు ఆసక్తిగల నిరుద్యోగ యువతీయువకులు ఏప్రిల్ 1లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేదా కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9182920381 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

పరీక్ష కేంద్రాల పరిశీలన

శెట్టూరు: మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ ఫణికుమార్ మంగళవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూళ్లను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. మండలంలో 440 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గాయత్రి పాల్గొన్నారు.

31న వాహనాల వేలం

రాయదుర్గం/గుమ్మఘట్ట: రాయదుర్గం సెబ్ ఆధ్వర్యంలో పట్టుబడ్డ పలు ద్విచక్ర వాహనాలను ఈ నెల 31న అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సమక్షంలో వేలం నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5 వేలు ముందుగా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే గుమ్మఘట్ట పోలీస్‌స్టేషన్ కార్యాలయ ఆవరణంలో 13 ద్విచక్రవాహనాలను సెబ్ ఆధ్వర్యంలో ఈ నెల 31న వేలం వేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ శ్రీరాంప్రసాద్ తెలిపారు.

వారపు సంత వేలం

వజ్రకరూరు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం వారపు సంత బహిరంగ వేలం ప్రశాంతంగా జరిగింది. గ్రామానికి చెందిన ఎం.దేవరాజు రూ.83 వేలకు సంవత్సర కాలానికి సంతను దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. సర్పంచు మోనాలిసా, ఉపసర్పంచు మధురెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రావు, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

31న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రాయదుర్గంటౌన్: పురపాలకసంఘంలోని కౌన్సిల్ హాల్‌లో 31వ తేదీ ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాల వారిగా అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

ఇంటింటికీ రేషన్ అందాలి

కూడేరు: ఎండీయూ ఆపరేటర్లు రేషన్ డీలర్ల సహకారం తీసుకుని ఇంటింటికీ రేషన్ సరుకులు అందజేయాలని సీఎస్‌డీటీ లక్ష్మీదేవి సూచించారు. మంగళవారం ఆమె డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సరుకుల పంపిణీపై సమీక్షించారు. కాగా పలువురు డీలర్లు సమావేశానికి ఆలస్యంగా రావడం, కొందరు గైర్హాజరు కావడంతో సీఎస్‌డీటీ అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గడువులోపు కార్డుదారులందరికీ సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు.

మలేరియా, డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

బొమ్మనహాళ్: మలేరియా, డెంగీపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచించారు. మంగళవారం మండలంలోని శ్రీధరఘట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. అనంతరం ఆస్పత్రికి వచ్చే జ్వరపీడితుల వివరాల గురించి ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అదనపు మలేరియా అధికారి సత్యనారాయణ, వైద్యాధికారులు కుమారరాజా, గీతాభార్గవి, హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, పీహెచ్ఎన్ సుశీలమ్మ, సూపర్‌వైజర్ రమేష్, ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

ఉరవకొండ: ఈ ఏడాది ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందించారు. మంగళవారం మండలంలోని ఆమిద్యాల ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సైన్స్ దినోత్సవంలో జిల్లాస్థాయిలో అద్భుత ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు కాకినాడకు చెందిన క్రియ సంస్థ మెడల్స్, సర్టిఫికెట్లు అందించింది. ప్రధానోపాధ్యాయురాలు జీవీ నాగమంజుల, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం గ్రామంలో కేటీఎస్ ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పచ్చదనం, పరిశుభ్రతపై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం క్యాన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, గోవర్ధన, పాండురంగ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

వజ్రకరూరు: మండలంలోని జరుట్లరాంపురంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం హుండీ కానుకలను లెక్కించారు. 2022 జనవరి 28 నుంచి 2023 మార్చి 28 వరకూ రూ.6,31,915 ఆదాయం వచ్చినట్లు ఈఓ అంగదాల క్రిష్ణయ్య తెలిపారు. అంతకుముందు ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ రామాంజనేయులు, పర్యవేక్షణాధికారి దేవదాస్, అర్చకులు రాజేంద్రప్రసాద్‌స్వామి, మంజునాథస్వామి, జూనియర్ అసిస్టెంట్ లాలేష్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవేంద్ర



కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవేంద్ర ఏకగ్రీవమయ్యారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తోటి న్యాయవాదులు, ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా పట్టాభి, కార్యదర్శిగా భంగి రవి, సంయుక్త కార్యదర్శిగా కె.ఎర్రిస్వామి, కోశాధికారిగా టి.రామాంజినేయులు, మహిళా ప్రతినిధిగా పరిపూర్ణవతిని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.